పొట్టకూటికి వచ్చి.. చితికిపోయి

వలస కూలీల మరణాలపై నిర్లక్ష్యం


చేతులు దులుపుకుంటున్న యజమాన్యాలు

సొంత గ్రామానికి చేర్చేందుకు ఆర్థిక సమస్య

అనాథ శవంగా అంతిమ సంస్కారాలు

పారిశ్రామిక ప్రాంతాల్లో హృదయవిదారక ఘటనలు

7



పల్లెవెలుగు బస్సులకే ఎక్స్‌ప్రెస్ బోర్డులు

ప్రయాణికుల నుంచి ఎక్స్‌ప్రెస్ చార్జీల వసూలు

ఆర్టీసీ వింత పోకడ

ఖేడ్ డిపోలో యాభై శాతం ఎక్స్‌ప్రెస్‌లే..

7



కేజీబీవీల్లో విద్యార్థినులకు స్పోర్ట్స్ కిట్

పంపిణీ చేయాలని సర్కారు నిర్ణయం

జిల్లాలో ఆరు వేల మంది బాలికలకు లబ్ధి

సంగారెడ్డి అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీల్లో విద్యనభ్యసించే విద్యార్థినులకు క్రీడా దుస్తులు, బూట్లు అందజేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. సంగారెడ్డి జిల్లాలో 22 కేజీబీవీలు ఉన్నాయి. వీటిలో సుమారు 6 వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ పరిధిలోని సమగ్ర శిక్ష ప్రాజెక్టు పరిధిలో పనిచేస్తున్న కేజీబీవీ బాలికలకు గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ సారి క్రీడా దుస్తులు(ట్రాక్‌సూట్లు), బూట్లు అందజేయాలని నిర్ణయం తీసుకోవడం పట్ల విద్యార్థినీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా పోటీలు జరిగితే క్రీడా దుస్తుల కోసం దాతల్ని వెతుక్కోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కేజీబీవీ బాలికలకు లబ్ధి చేకూరనున్నది.

కుక్కల స్వైరవిహారం

అచ్చంపేటలో ఇద్దరికి గాయాలు

మాసాయిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో ఇద్దరు గాయపడిన సంఘటన మండల పరిధిలోని అచ్చంపేటలో గురువారం మధ్యాహ్నం జరిగింది. గ్రామానికి చెందిన వాళ్లబోయిన నాగమణి, చాకలి శ్రీనివాస్‌పై వీధి కుక్కలు, పిచ్చి కుక్క దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. గ్రామంలో కొద్ది రోజులుగా కుక్కలు విచ్చలవిడిగా తిరుగుతూ దాడులకు పాల్పడుతున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై గ్రామ కార్యదర్శి నాగరాజుగౌడ్‌ను వివరణ కోరగా కుక్కల దాడిలో గాయపడిన వారికి వెంటనే చికిత్స అందజేస్తామని తెలిపారు.





కుక్కల దాడిలో మహిళకు గాయాలు

గూడెం.. గండం దాటేనా?



సుప్రీం కోర్టు తీర్పుతో చర్చ

పార్టీ వీడలేదని గతంలోనే అఫిడవిట్

ఇరుపార్టీలకు దూరంగా ఎమ్మెల్యే

మహిపాల్‌రెడ్డిని వెంటాడుతున్న కేసులు

పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత విషయంలో సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గంలో రాజకీయ చర్చ మొదలైంది. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన గూడెం మహిపాల్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న విషయం తెలిసిందే. పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరడాన్ని సవాల్ చేస్తూ వారిని అనర్హులుగా గుర్తించాలని, ప్రజాప్రాతినిధ్య చట్టాన్ని అమలు చేయాలని గులాబీ పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఈ కేసులో మూడు నెలల్లో శాసనసభ స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో ఉత్కంఠ నెలకొంది. అసెంబ్లీ స్పీకర్ నిర్ణయంపై ఆ ఎమ్మెల్యేల భవితవ్యం ఆధారపడి ఉంది. స్పీకర్ అనర్హత వేటు వేస్తే నియోకవర్గంలో ఉప ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్న చర్చ జరుగుతోంది.

మరో వైపు తాను బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయలేదని, ఈ ఏడాది కూడా పార్టీ సభ్యత్వం తీసుకున్నానని గతంలోనే ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎంను కలిసిన సమయంలో వేసిన కండువా ఆధారంగా పార్టీ ఫిరాయించినట్లు భావించకూడదని కోరారు. తాను ఏనాడు కాంగ్రెస్ పార్టీ సభ్యత్వాన్ని అధికారికంగా తీసుకోలేదని అత్యున్నత న్యాయస్థానానికి మహిపాల్‌రెడ్డి వివరించారు. తాను బీఆర్ఎస్ విప్‌ను ధిక్కరిస్తూ శాసనసభలో క్రాస్ ఓటింగ్‌కు పాల్పడినట్లు ఆధారాలు లేవని స్పష్టం చేశారు.

-అమీన్‌పూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి)

వెంటాడుతున్న ప్రజాప్రాతినిధ్య చట్టం

హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా పేరు తెచుకున్న మహిపాల్‌రెడ్డిని ప్రజాప్రాతినిధ్య, ఫిరాయింపు చట్టాలు ఏదో రూపంలో వెంటాడుతూనే ఉన్నాయి. 2014లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలుపొందనపుడు ఓ కేసుకు సంబంధించి రెండున్నరేళ్ల జైలు శిక్ష పడటంతో ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించాలన్న డిమాండ్ వ్యక్తం అయింది. జిల్లా కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు వెళ్లిన సదరు కేసులో తీర్పు మహిపాల్‌రెడ్డికి అనుకూలంగా రావంతో ఊపిరిపీల్చుకున్నారు. ఈ కేసు ఆయన మొదటిసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన సమయంలో కొంత చికాకు కలిగించిన అంశమే. మూడోసారి ఎమ్మెల్యే అయిన తర్వాత ఈసారి పార్టీ ఫిరాయింపు చట్టం ప్రకారం అనర్హుడిగా ప్రకటించాలని బీఆర్ఎస్ నాయకత్వం సుప్రీంను ఆశ్రయిండంతో తిరిగి మరోసారి ఆయన పదవి చర్చనీయాంశమైంది. పార్టీ ఫిరాయింపుపై సుప్రీంకోర్టు సీరియస్‌గా ఉన్న నేపథ్యంలో ఆయన శిబిరంలో తీవ్ర ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

కాంగ్రెస్ కార్యకలాపాలకు దూరంగా..

పటాన్‌చెరు ఎమ్మెల్యే కాంగ్రెస్‌లో చేరినా.. నియోకవర్గంలో ఎక్కడా ఆ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. పార్టీ పిరాయించినట్లు ఆధారాలు చిక్కకుండా న్యాయవాదుల సలహా మేరకు నడుచుకుంటున్నారు. ఇటీవల నియెజకవర్గంలో కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి రాష్ట్ర పరిశీలకులు హాజరైనా ఎమ్మెల్యే అంటీ ముట్టనట్లు వ్యవహరించారు. గాంధీభవన్‌లో సమావేశాలు నిర్వహించినా.. ఆయన గానీ, ఆయన వర్గీయులు కాని అటువైపు వెళ్లలేదు. ఇటు బీఆర్ఎస్‌తోనూ అంతే దూరం పాటిస్తున్నారు. ఆ పార్టీ కార్యక్రమాల్లోనూ ఆయన కనిపించ కుండా తటస్థంగా వ్యవహరిస్తున్నారు.

కాలంచెల్లిన వాహనాలతో కాలుష్య కాటు



రోడ్లపై పరుగులు.. ప్రేక్షక పాత్రలో పోలీసులు

ప్రకటనలతోనే సరిపెడుతున్న రవాణా శాఖ

సమన్వయ లోపంతో పెరుగుతున్న ప్రమాదాలు

అనారోగ్యాల బారినపుడుతున్న ప్రజలు

రహదారులపై కాలుష్యానికి, ప్రమాదాలకు కారణమవుతున్న పాత వాహనాలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. పదేళ్లు దాటిన డీజిల్ వాహనాలు, పదిహేనేళ్లు పూర్తయిన పెట్రోల్ బండ్లను కాలం చెల్లిన వాహనాలుగా పరిగణిస్తారు. వీటి వల్ల వాతావరణ కాలుష్యం పెరిగి ప్రజారోగ్యం దెబ్బతింటోంది.

సంగారెడ్డి క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాలం చెల్లిన వాహనాల నుంచి వచ్చే దట్టమైన పొగ కారణంగా వెనుక వచ్చే వాహనదారులకు రోడ్డు సరిగా కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతల్లో పడిపోవడమో, ఎదురుగా వచ్చే వాహనాలను ఢీకొనడమో వంటి సంఘటనలు పెరుగుతున్నాయి. ద్విచక్ర వాహనదారులు పొగ వల్ల ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా, ఈ వాహనాలు తరచుగా మధ్యలో ఆగిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నాయి.

పోలీసుల నిర్లక్ష్యం, రవాణా శాఖ వైఫల్యం

ట్రాఫిక్ పోలీసులు కాలం చెల్లిన వాహనాలపై నిఘా పెట్టడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్సు తనిఖీలకు మాత్రమే పరిమితమవుతున్నారు. వాహనాల కాలపరిమితిని పట్టించుకోవడం లేదు. మరో వైపు, రవాణా శాఖ అధికారులు కేవలం ప్రకటనలతోనే సరిపెడుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదని తెలుస్తోంది. ప్రతి సంవత్సరం విద్యా సంవత్సరం ప్రారంభంలో చేసే హడావుడి మినహా, పాత వాహనాలను అరికట్టేందుకు తనిఖీలు చేపట్టడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

కఠిన చర్యలతోనే ప్రయోజనం

కాలం చెల్లిన వాహనాలను నియంత్రించడానికి ఢిల్లీ ప్రభుత్వం తీసుకున్న తరహా కఠిన నిర్ణయాలు తెలంగాణలో కూడా అవసరమని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. పాత వాహనాలకు పెట్రోల్ బంకుల్లో ఇంధనం పోయకుండా నిషేధించడం వంటి చర్యలు తీసుకుంటే పాత వాహనాల సంఖ్యను గణనీయంగా తగ్గించవచ్చని సూచిస్తున్నారు. ప్రభుత్వం, పోలీసులు, రవాణా శాఖ సమన్వయంతో పని చేసి పాత వాహనాల బెడద నుంచి ప్రజలకు విముక్తి కలించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

సంగారెడ్డి జిల్లాలో కాలం చెల్లిన వాహనాల సంఖ్య

మోటార్ వాహనాలు	1,04,157
కార్లు	15,683
విద్యా సంస్థల బస్సులు	230
ట్రావెల్స్ బస్సులు	54
మోటార్ క్యాబ్‌లు	486



ప్రభుత్వ దవాఖానాల్లో మెరుగైన వైద్య సేవలందించాలి

● పీహెచ్‌సీల్లో అన్ని మందులు అందుబాటులో ఉండాలి ● సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

కంది, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యసేవలందించాలని సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కంది మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆమె తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరును పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. ఆస్పత్రిలో ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ వివరాలపై ఆరా తీశారు. నెలవారీ జరిగే ప్రసవాల గణాంకాలను అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆస్పత్రిలో అన్ని మందులు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. వైద్యులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి అవసరమైన చికిత్స అందించాలని ఆదేశించారు. తనిఖీల సందర్భంగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో కూడా కలెక్టర్ మాట్లాడారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆమె సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని, సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు డిజిటల్ తరగతిని బోధించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన సదుపాయాలు అందజేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం, మెరుగైన బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కలెక్టర్ వెంట వైద్యాధికారి సాయిశంకర్, హెచ్‌ఎం వెంకటలక్ష్మి, ఎస్‌ఐ రవీందర్, పంచాయతీ కార్యదర్శి కవిత, బిల్ కలెక్టర్ కోకల వీర్రాజు, కిరణ్ ఉన్నారు.



కంది పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య

పరిశ్రమలకు వేగంగా అనుమతులు

సంగారెడ్డి క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను వేగంగా పరిష్కరించాలని, నిర్ణీత వ్యవధిలో అనుమతులు మంజూరు చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా పరిశ్రమల ప్రమోషన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. యువత పరిశ్రమల స్థాపన కోసం ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిబంధనల ప్రకారమే ఇందిరమ్మ గృహాల నిర్మాణం: కలెక్టర్

అల్లాదుర్గం, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ గృహాలను ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకే నిర్మించుకోవాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ లబ్ధిదారులకు సూచించారు. మండలంలోని గడిపెద్దాపూర్, ముస్లాపూర్‌లో ఇందిరమ్మ గృహాలను, ప్రభుత్వ ఆసుపత్రి, ఫర్టిలైజర్ షాపులు, పశువైద్య కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. గడిపెద్దాపూర్‌లో ఓ ఇంటి నిర్మాణం కొలతలు పెద్దగా ఉండటంతో కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని సూచించారు. నిర్మాణ పనులు మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. వానాకాలం సీజన్‌లో వ్యాధులు వ్యాపించకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని తెలిపారు. రోగులకు అందుబాటులో ఉండాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లయ్య, ఎంపీడీవో చంద్రశేఖర్, ఈజీఎస్ ఏపీవో సుధాకర్, ఎంపీవో లింగప్ప, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



గడిపెద్దాపూర్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న మెదక్ కలెక్టర్



సంగారెడ్డిలో ముఖ గుర్తింపు హాజరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయురాలు

టీచర్ల హాజరు.. ఇక పక్కా..

ప్రభుత్వ పాఠశాలల్లో నేటి నుంచి ముఖ గుర్తింపుతో హాజరు నమోదు

సంగారెడ్డి అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు సమయపాలన పాటించేందుకు విద్యాశాఖ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. టీచర్లు సకాలంలో పాఠశాలలకు రాకపోవడం, వచ్చినా సమయం ముగియకముందే వెళ్లిపోతున్నారనే విమర్శలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ముఖ గుర్తింపు హాజరు విధానం ప్రవేశ పెట్టబోతున్నది. నేటి నుంచి సంగారెడ్డి జిల్లాలోని సుమారు 1,237 సర్కారు బడుల్లో 5,860 వేల మంది టీచర్లకు (ఎఫ్ఆర్ఎస్) ఫేసియల్ రికగ్నిజేషన్ సిస్టం అమలు చేయనున్నారు. ఉపాధ్యాయులు ఉదయం 9 గంటలకు బడి ఆవరణలో యాప్‌ను ఆన్ చేసి ముఖ హాజరు నమోదు చేసుకోవాలి. సాయంత్రం 4 గంటల తర్వాత మరోసారి నమోదుతో హాజరు పూర్తవుతుంది. నిర్ణీత పనివేళల్లో తప్పనిసరిగా బడిలోనే ఉండాల్సి ఉంటుంది. హాజరు నమోదు సమయంలో లోకేషన్ ఆన్ చేసుకుని, పాఠశాల ఆవరణలో ఉండి యాప్‌ను ఓపెన్ చేస్తే ఉపాధ్యాయుల చిత్రం సహా హాజరు నమోదు అవుతుంది. రెండేళ్ల క్రితమే ఈ విధానాన్ని విద్యార్థులకు అమలు చేస్తుండగా తాజాగా ఉపాధ్యాయులకు ఈ వర్తింపజేసేలా సర్కారు కీలక నిర్ణయం తీసుకున్నది.

డుమ్మాలకు చెక్

జిల్లాలో పలువురు టీచర్లు అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్నట్టు ఆరోపణలున్నాయి. ఉన్నతాధికారులకు సమాచారం లేకుండా డుమ్మాలు కొడుతున్నారనే విమర్శలున్నాయి. మారుమూల గ్రామాల్లో ఉపాధ్యాయులు బడులకు సకాలంలో రాకపోగా సాయంత్రం త్వరగా వెళ్లిపోతున్నారనే ఆరోపణలున్నాయి. కొంతమంది వంతులవారీగా విధులు నిర్వర్తిస్తూ సొంత పనులు చక్కబెట్టుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. కొన్నిచోట్ల ఏకంగా సొంతగా వలంటీర్లను నియమించుకొని పాఠాలు చెప్పిస్తున్న ఉదంతాలు వెలుగు చూసిన సందర్భాలున్నాయి. వీటన్నింటికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం ముఖ గుర్తింపు హాజరు తెరపైకి తీసుకొచ్చింది. ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త హాజరు విధానంతో అనధికార గైర్హాజరుకు చెక్ పడనుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కాగా జిల్లాలో ఉపాధ్యాయుల ఎఫ్ఆర్ఎస్ హాజరును పక్కాగా అమలు చేస్తామని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

140 మంది బాల కార్మికులకు విముక్తి

● ఆపరేషన్ ముస్కాన్ నిరంతర ప్రక్రియ
● మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు


మాట్లాడుతున్న మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

మెదక్ అర్బన్, జూలై 31(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా జిల్లాలో 140 మంది బాల కార్మికులను గుర్తించి విముక్తి కల్పించామని మెదక్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. గురువారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షలో ఆయన మాట్లాడారు. బాల కార్మికుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను అప్పగించామన్నారు. 90 కేసులను నమోదు చేశామన్నారు. బావిభారత పౌరులైన చిన్నారులతో వెట్టి చాకిరీ చేయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఆపరేషన్ ముస్కాన్ నిరంతరం సాగే ప్రక్రియ అని ఎస్పీ తెలిపారు. యువత ప్రవర్తనపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాలో నేరాల నియంత్రణపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. నేరాల నియంత్రణకు సాంకేతిక ఆధారాలతో కూడిన ఆధునిక పద్ధతులను అమలు చేయాలన్నారు. నమోదైన కేసుల దర్యాప్తులో వేగం పెంచాలన్నారు. పోక్సో, ఎస్సీ, ఎస్టీ, గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల్లో త్వరితగతిన విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. సీసీ టీవీలను కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. రోడ్డు ప్రమాదాలు నివారణ, ట్రాఫిక్ నియంత్రణ, రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా, సైబర్ నేరాలు, ఆన్‌లైన్ బెట్టింగ్, లోన్ యాప్ మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గంజాయి అక్రమ రవాణా, పేకాటపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విజిబుల్ పోలీసింగ్, పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. ఈ సమీక్షలో అదనపు ఎస్పీ మహేందర్, మెదక్, తూప్రాన్ డీఎస్పీలు ప్రసన్నకుమార్, నరేందర్‌గౌడ్, సీఐలు, ఎస్ఐలు, అధికారులు పాల్గొన్నారు.

బాల కార్మికులతో పనిచేయిస్తున్న కంపెనీ యాజమానులపై కేసు నమోదు

రాయపోల్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికులతో పని చేయిస్తున్న కోళ్ల దాన తయారీ కంపెనీపై దాడి చేసి బాలలకు విముక్తి కల్పించి నిర్వాహకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. రాయపోల్ ఎస్ఐ మానస కథనం ప్రకారం ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలో ప్రీమియం చిక్ ఫీడ్ సంస్థలో లేబర్ ఆఫీసర్లు తనిఖీ చేయగా ఐదుగురు బాల కార్మికులు ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వారికి విముక్తి కల్పించి చైల్డ్ వెల్ఫేర్ హోమ్‌కు తరలించారు. సంస్థ యజమానులు సత్యేంద్రకుమార్, సమాధానం తాత్యాబులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు గంజాయి కేసుల్లో ఇద్దరికి ఐదేళ్ల జైలు

సంగారెడ్డి క్రైం/నారాయణఖేడ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): రెండు వేర్వేరు కేసుల్లో గంజాయి అక్రమంగా తరలించిన మునిపల్లి మండలానికి చెందిన ఒకరు, సిర్గాపూర్ మండలానికి చెందిన మరొకరికి ఐదేళ్ల జైలు శిక్ష ఖరారైంది. సంగారెడ్డి ఎక్సైజ్ సీఐ నజీర్ పాష తెలిపిన వివరాల ప్రకారం.... మునిపల్లి మండలం పెద్దలోని గ్రామానికి చెందిన మన్నె రాములు 2022లో అక్రమంగా 36 గంజాయి మొక్కలను సాగు చేస్తూ ఎక్సైజ్ పోలీసులకు చిక్కాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం నేరం రుజువు కావడంతో మన్నె రాములుకు ఐదు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.25వేలు జరిమానా విధిస్తూ జిల్లా అదనపు న్యాయాధికారి జయంతి గురువారం తీర్పు వెలువరించారు.

ఖేడ్ ఎక్సైజ్ సీఐ రఘునాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సిర్గాపూర్ మండలం వంగ్దాల్ పరిధిలోని గైర్యాన్ తండాకు చెందిన మూడ్ గణపతి చౌహాన్ తన పొలంలో గంజాయి సాగు చేస్తున్నట్లు సమాచారం అందడంతో అప్పటి జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి బాలకిష్టారెడ్డి, ఎస్ఐ సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో 2013 ఆగస్టు 24న దాడి చేశారు. గణపతి చౌహాన్ పొలంలో 75 వేల గంజాయి మొక్కలను ధ్వంసం చేసి అప్పట్లో కేసు నమోదు చేశారు. ఈ కేసును జిల్లా అదనపు కోర్టులో విచారణ జరపడంతో కోర్టు పీపీ రాజేశ్వర్ వాదించి నేరం రుజువు చేయడంతో నిందితుడికి న్యాయమూర్తి జయంతి ఐదేళ్ల కారాగార శిక్ష, రూ.25 వేల జరిమాన విధిస్తూ తీర్పునిచ్చారని తెలిపారు.

చేర్యాలలో గంజాయి పట్టివేత.. ఇద్దరి అరెస్ట్

చేర్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణ శివారులో గంజాయి విక్రయానికి యత్నించిన ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్, పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు చేర్యాల సర్కిల్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటుచేసిన సమావేశంలో సీఐ ఎల్.శ్రీను నిందితుల వివరాలు వెల్లడించారు. పట్టణానికి చెందిన నీలం చందు, ఆకుల హర్షవర్ధన్ జల్సాలకు అలవాటుపడి గంజాయి విక్రయానికి పాల్పడుతున్నారు. డిగ్రీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఆకుల హర్షవర్ధన్ టెంట్‌హౌజ్‌లో, ఇంటర్ చదివిన చందు కూలీ పనులు చేస్తున్నారు. ఈ క్రమంలో వారు గంజాయి విక్రయానికి అలవాటుపడ్డారు. హైదరాబాదులో గుర్తుతెలియని వ్యక్తినుంచి గంజాయిని కొనుగోలు చేసి స్థానికంగా విక్రయించేందుకు యత్నిస్తున్న క్రమంలో పక్కా సమాచారం మేరకు దాడులు చేపట్టి ఇద్దరిని పట్టుకున్నారు. వారి నుంచి 180 గ్రాముల గంజాయి, స్కూటీ, రెండు మొబైల్ ఫోన్లు సీజ్ చేసి స్వాధీనం పోలీసులు చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించారు. కాగా, యువకులు, విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై దృష్టి సారించాలని, గంజాయి సేవనానికి పాల్పడినా, విక్రయించినా, రవాణా చేసినా చర్యలు తప్పవన్నారు. మత్తుఅలవాట్లకు లోనై జీవితాలను నాశనం చేసుకోకూడదని తెలిపారు. సమావేశంలో చేర్యాల ఎస్ఐ నవీన్, టాస్క్‌ఫోర్స్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


అరెస్ట్ వివరాలు తెలుపుతున్న చేర్యాల సీఐ ఎల్.శ్రీను

భార్యను చంపిన భర్తకు యావజ్జీవ శిక్ష

సిద్దిపేట క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : అదనపు కట్నం తేవాలని భార్యను వేధించి గొంతునులిమి చంపిన కేసు భర్తకు యావజ్జీవ కారాగార శిక్ష పడింది. సిద్దిపేట పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నకోడూరు మండలం విఠలాపూర్ గ్రామానికి చెందిన గంగసాని శ్రీనివాస్‌కు కర్ణాటక రాష్ట్రం రాయచూర్‌కు చెందిన ఇందిరాతో 2011లో వివాహం జరిగింది. కొద్ది రోజులు వారి సంసారం సాఫీగానే సాగింది. తర్వాత భర్త, అత్తమామలు అదనపు కట్నం తీసుకొని రమ్మని మానసికంగా ఇందిరాను హింసించారు. 2019 ఏప్రిల్ 9వ తేదీన రాత్రి 10 గంటల సమయంలో ఇందిరా వారి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రూ.పదివేల అదనపు కట్నం కావాలని లేకుంటే బంగారం గుంజుకుంటామని బెదిరిస్తున్నారని తెలిపింది. మరుసటి రోజు ఉదయం 6 గంటలకు ఇందిరా చనిపోయిందని ఫోను రాగానే కుటుంబ సభ్యులు కలసి విఠలాపూర్‌కు వచ్చారు. ఇందిరా మృతదేహాన్ని చూసిన తర్వాత మృతురాలి సోదరుడు వీరేష్‌రెడ్డి తన బావ శ్రీనివాస్‌రెడ్డి, తన చెల్లెలు ఇందిరాను గొంతు పిసికి చంపారని చిన్నకోడూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, అప్పటి ఎస్ఐ అశోక్ కేసు నమోదు చేశాడు. అప్పటి రూరల్ సీఐ వెంకట్‌రామయ్య కేసు పరిశోధన ప్రారంభించి నేరస్థుని అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించారు. కేసు విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. గురువారం జిల్లా ప్రధాన న్యాయాధికారి సాయిరమాదేవి ఇరువురి వాదనలు విన్న తర్వాత నేరం రుజువైనందున శ్రీనివాస్‌కు యావజ్జీవ కారాగార శిక్ష, రూ.2000 జరిమాన విధించారు.


రోడ్డుపై అడ్డంగా బోల్తాపడిన లారీ

హైవేపై రెండు లారీలు బోల్తా

● ఒకదానికొకటి ఢీకొనడంతో ప్రమాదం

మనోహరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : రెండు లారీలు ఢీకొన్న ఘటన గురువారం మనోహరాబాద్ మండలం దండుపల్లి 44వ జాతీయ రహదారిపై చోటుచేసుకున్నది. ఈ ఘటనలో నలుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దండుపల్లి ఐటీసీ వద్ద యూటర్న్ తీసుకుంటున్న భారీ లారీని మరో లోడ్‌తో ఉన్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో కంటైనర్ బాడీతో ఉన్న లారీ హైవేపై రోడ్డుకు అడ్డంగా బోల్తా పడగా, మరొక లారీ రోడ్డు పక్కన గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో రెండు లారీల డ్రైవర్లు, క్లీనర్లు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే దగ్గరలో ఉన్న ఆసుపత్రికి తరలించారు.

బాలిక నిశ్చితార్థం అడ్డుకున్న అధికారులు

మాసాయిపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఓ గ్రామంలో గురువారం జరగాల్సిన బాలిక నిశ్చితార్థాన్ని పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు కలిసి అడ్డుకున్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాధవి కథనం ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17)కు గురువారం నిశ్చితార్థం చేయాలని పెద్దలు నిర్ణయించారు. ఈ మేరకు సమాచారం అందుకున్న ఐసీడీఎస్ అధికారులు బాలిక ఇంటికి వెళ్లారు. అప్పటికే వరుడు కూడా అక్కడికి రాగా, వరుడికి.. బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి.. నిశ్చితార్థాన్ని నిలిపివేశారు. బాలిక మైనారిటీ తీరిన తర్వాత వివాహం చేయాలని సూచించారు.

అధికారులకు నోటీసులు అందజేసిన అటవీశాఖ

జహీరాబాద్,జూలై 31(ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో చెట్ల నరికివేతకు కారణమైన విద్యుత్‌శాఖ అధికారులకు గురువారం జహీరాబాద్ పట్టణ అటవీ శాఖ సెక్షన్ అధికారి కిరణ్ వివరణ ఇవ్వాలని కోరుతూ నోటీసులను అందజేశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులు మాట్లాడుతూ అధికారులైన, ప్రజలైన ఇష్టారీతిన చెట్లను నరికివేస్తే చర్యలు తప్పవన్నారు. చెట్లను నరికివేయాలంటే అటవీశాఖ అధికారుల అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. తాము అందజేసిన నోటీసులకు వివరణ ఇవ్వకపోతే కేసులను నమోదు చేస్తామని పేర్కొన్నారు. చెట్ల నరికివేతకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

గేదెను ఢీకొన్న బైక్.. ఒకరి మృతి

కౌడిపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బైక్‌తో గేదెను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని ధర్మసాగర్ శివారులో గురువారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని బురుగడ్డకు చెందిన మ్యాకల నాగరాజు(42) బైక్‌పై మండల కేంద్రంలోని మార్కెట్‌కు కూరగాయల కోస వచ్చాడు. తిరుగు ప్రయాణంలో ధర్మసాగర్ శివారులో గేదెను బైక్‌తో ఢీ కొట్టాడు. దీంతో తీవ్రంగా గాయపడిన నాగరాజును వెంటనే నర్సాపూర్ ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందాడు. నాగరాజుకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

చేర్యాల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్టుపై నుంచి జారిపడి గీత కార్మికుడు తీవ్రగాయాలపాలైన సంఘటన గురువారం చేర్యాల మండలం ముస్త్యాల గ్రామంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముస్త్యాల గ్రామానికి చెందిన మెరిగే నర్సింహులు రోజువారీలా గురువారం తాటివనంలో తాటిచెట్టు ఎక్కుతుండగా, ప్రమాదవశాత్తు జారి కింద పడిపోయాడు. దీంతో గాయాలపాలవడంతో చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ప్రాథమిక చికిత్స జరిపగా, మెరుగైన చికిత్స కోసం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. గాయాలపాలైన నర్సింహులుకు వెంటనే ఎక్స్‌గ్రేషియో అందించి ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండ కింది అరుణ్‌కుమార్ కోరారు.

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి పూర్వవైభవం తీసుకురావాలి

● కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగుల వినతి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు

కంది, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మంత్రిగారు మా సమస్యలు పరిష్కరించి, ఆర్డినెన్స్ ఫ్యాక్టరీకి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఎద్దుమైలారం వద్దనున్న మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఢిల్లీలో కిషన్‌రెడ్డిని ఆయన కార్యాలయలంలో గురువారం బీజేపీ సీనియర్ నాయకులు నల్ల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో బీఎంఎస్(భారతీయ మజ్దూర్ సంఘ్) నాయకులు ఎల్.బాలనర్సయ్య, బి.ఈశ్వరయ్య, కె.ప్రభు, టి.రవి, బి.శివకుమార్, కంది శ్రీనివాస్, టి.ప్రదీప్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ రక్షణ రంగానికి వెన్నుముకగా నిలిచిన మెదక్ ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ కార్పొరేటీకరణ తర్వాత వర్క్‌లోడ్ లేక నిరాశకు గురవుతున్నారు. రెండేళ్ల నుంచి పాత పద్ధతిలో పింఛన్ ఇవ్వాలని ఉద్యోగులంతా ఆశగా ఎదురుచూస్తున్నారు. ఈ విషయాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృష్టికి తీసుకెళ్లాలని కిషన్‌రెడ్డికి వారు విజ్ఞప్తి చేశారు. ఇందుకు కిషన్‌రెడ్డి సానుకూలంగా స్పందించి తమ సమస్యలను పరిష్కరించనున్నట్లు వారు తెలిపారు. అతి త్వరలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు సహకారంతో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను కలవనున్నట్లు తెలిపారు. 500ల బీఎంపీ-2 యుద్ధ వాహనాలు, నాగ్-2 వెపన్స్ తయారీ ఆర్డర్లు, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని కోరనున్నట్లు ఉద్యోగులు తెలిపారు.

జంగమ సమాజ భవన నిర్మాణానికి భూమి పూజ చేసిన జగద్గురు



ఖేడ్‌లో జంగమ సమాజన భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న చంద్రశేఖర్ శివాచార్య

నారాయణఖేడ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణ శివారులో జంగమ సమాజ భవన నిర్మాణానికి గురువారం కాశీ జగద్గురు చంద్రశేఖర శివాచార్య భూమి పూజను నిర్వహించారు. నిర్మాణ పనులను ఏడాదిలోపు పూర్తి చేయాలని స్థానిక జంగమ సమాజం బాధ్యులకు సూచిస్తూ భవన నిర్మాణం కోసం తనవంతుగా రూ.51 వేలను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ భిక్షపతిస్వామి, ఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి సతీమణి అనుపమరెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు సుధాకర్‌రెడ్డి, వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు బార్షిమణికంఠస్వామి, జంగమ సమాజం బాధ్యులు సిద్ధయ్యస్వామి, రేవణయ్య, నరేష్‌స్వామి, విజయ్‌కుమార్ స్వామి, సతీష్ స్వామి, బస్వరాజ్ స్వామి, తదితరులుపాల్గొన్నారు.

ఐక్యంగా ఉంటేనే హక్కులను సాధించుకోగలం

● ఆగస్టు 15లోపు పరిష్కరించకుంటే ఉద్యమ కార్యాచరణ
● ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్



సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్


హుస్నాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఐక్యంగా ఉంటేనే మన హక్కులను సాధించుకోగలుగుతామని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు, ఉద్యోగ సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్ పిలుపునిచ్చారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన లెక్చరర్ చాడ మధుసూదన్‌రెడ్డి ఉద్యోగ విరమణ సన్మాన సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగుల 57 డిమాండ్లలో మన పోరాటాలతో ప్రభుత్వం 16 డిమాండ్లు ఒప్పుకుందని తెలిపారు. వీటిని ఆగస్టు 15లోపు పరిష్కరించకుంటే మరొక ఉద్యమ కార్యాచరణ చేపడుతామని వెల్లడించారు. ప్రస్తుతం 90 శాతం జీపీఎఫ్ వస్తుందన్నారు. ప్రొఫెసర్ల వలే లెక్చరర్లకూ ఉద్యోగ విరమణ 65 సంవత్సరాలు ఉండాలనే విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి అమలయ్యేలా చూస్తామన్నారు. ఉద్యోగులకు ప్రభుత్వం రూ.13 వేల కోట్లు అప్పు పడిందన్నారు. ప్రస్తుతం ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారని, వారికి సహాయం చేయాలని, వీకర్ సెక్షన్లను ఆదుకోవాలని, కానీ అన్ని ఉచితాలు ఇవ్వొద్దని తాను అనడంతో విమర్శలు చేస్తున్నారన్నారు. ఉద్యోగులకు ఒక డీఏ ఇప్పించామని, ఇంకో డీఏ ఆరు నెలలకు ఇస్తామన్నారని తెలిపారు. రాష్ట్రంలో 15 లక్షల మంది ఉద్యోగులుంటే దాదాపు 120 మంది ఏసీబీకి పట్టుబడితే ఉద్యోగులందరినీ అవినీతిపరులనడం కరెక్ట్ కాదని, ప్రభుత్వాన్ని నడిపేదే ఉద్యోగులని వెల్లడించారు. ఈ సమావేశంలో పాలిటెక్నిక్ లెక్చరర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తి, ప్రధాన కార్యదర్శి కృష్ణ, గౌరవ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, నర్సయ్యా గౌడ్, కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్, జర్నలిస్టు కొండా లక్ష్మణ్, ప్రిన్సిపాల్ శ్రీదేవి తదితరులున్నారు.

పొట్టకూటికి వచ్చి.. చితికిపోయి



బీహార్ రాష్ట్రానికి చెందిన సద్దాం ఆరుగురుసభ్యులున్న తన కుటుంబపోషణ కోసం వందల కిలోమీటర్ల దూరంలోని ఐడీఏ బొల్లారం పారిశ్రామికవాడకు వచ్చాడు. ఓ కంపెనీలో రూ.15 వేల వేతనానికి పనిలో చేరాడు. ఊర్లోని కుటుంబానికి డబ్బు పంపుతుండేవాడు. ఓరోజు అకస్మాత్తుగా విధి నిర్వహణలో ఉన్నప్పుడే సద్దాంకు వాంతులు అయ్యాయి. తోటి వారి సహకారంతో అద్దెకున్నచోటుకు వచ్చాడు. దగ్గరలోని ఆసుపత్రిలో చికిత్స పొందాడు. అర్ధరాత్రి సమయంలో మృత్యువాతపడ్డాడు. తోటి కార్మికులు సద్దాం మృతదేహాన్ని గ్రామానికి పంపడానికి డబ్బు కావాలని కంపెనీ యజమానిని అడిగితే సంబంధం లేదంటూ సమాధానం ఇవ్వడంతో చేసేది లేక స్థానికంగా అనాథ శవంగా అంతిమ సంస్కారాలు చేశారు. శవం కాలుతున్న సమయంలో కుటుంబసభ్యులకు వాట్సాప్ వీడియో కాల్ ద్వారా చూపించారు. కుటుంబానికి అదే చివరిచూపుగా మారింది.

పొట్టకూటి కోసం పటాన్‌చెరు పారిశ్రామికవాడకు వచ్చే వలస కూలీలకు మరణంలోనూ వెంటాడుతున్న దుర్భర దుస్థితికి ఈ ఘటన ఓ నిదర్శనం. విదేశాలకు వెళ్లి చనిపోయిన వారి మృతదేహాలను ప్రభుత్వాలు రప్పిస్తున్న ఈ రోజుల్లో పారిశ్రామికవాడ నుంచి పక్క రాష్ట్రాలకు పంపించేందుకు చొరవ చూపేవారేరి?



- వలస కూలీల మరణాలపై నిర్లక్ష్యం
- చేతులు దులుపుకుంటున్న యజమాన్యాలు
- సొంత గ్రామానికి చేర్చేందుకు ఆర్థిక సమస్య
- అనాథ శవంగా అంతిమ సంస్కారాలు
- పారిశ్రామిక ప్రాంతాల్లో హృదయవిదారక ఘటనలు

ఐడీఏ బొల్లారం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పొట్టకూటి కోసం పుట్టిన ఊరును, కన్నవారిని, కుటుంబాన్ని వదిలి వచ్చిన వలస కూలీలకు పారిశ్రామికవాడలు మరణశయ్యలుగా మారుతున్నాయి. ఇక్కడ జీవనోపాధి కోసం వచ్చిన అనేక మంది అనారోగ్య సమస్యలతో అనాథ శవాలుగా మృత్యుఒడిలోకి చేరి, కుటుంబ సభ్యులకు చివరిచూపు కూడా దక్కకుండానే కనుమరుగవుతున్నారు. పని ప్రదేశంలో ఆరోగ్య సమస్యలు తలెత్తినప్పుడు యజమానులు నిర్లక్ష్యం వహించడం, వైద్య ఖర్చులు భరించకపోవడం వల్ల అనేక మంది కార్మికులు ప్రాణాలు కోల్పోతున్నారు. చనిపోయిన తర్వాత మృతదేహాన్ని వారి స్వగ్రామాలకు పంపించేందుకు కూడా డబ్బు లేక, తోటి కార్మికులు, స్వచ్ఛంద సంస్థల సాయంతో స్థానికంగానే అంత్యక్రియలు జరిపిస్తున్నారు. వాట్సాప్ వీడియోలో వారి చివరిచూపును చూసి కన్నీరు పెట్టుకోవడం తప్ప కుటుంబసభ్యులకు మరో దారి లేకుండా పోతోంది.

పని ప్రదేశాల్లో నిర్లక్ష్యం

పటాన్‌చెరు నియోజకవర్గంలోని ఐడీఏ బొల్లారం, బొంతపల్లి, గడ్డపోతారం, ఖాజీపల్లి, పటాన్‌చెరు, పాశమైలారం, రుద్రారం వంటి పారిశ్రామికవాడల్లో బీహార్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌ఘడ్ వంటి రాష్ట్రాల నుంచి పెద్దసంఖ్యలో వలస కార్మికులు పనిచేస్తున్నారు. ఈ పరిశ్రమల్లో పనిచేసే కార్మికులకు ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు యజమానులు వారికి ఎలాంటి సంబంధం లేదంటూ చేతులు దులుపుకుంటున్నారు. యజమాన్య సంఘాలు అయితే ప్రమాదాల వేళ సహాయం చేసుకుంటాయి. పటాన్‌చెరు, పాశమైలారం, బొంతపల్లి పారిశ్రామికవాడలకు ప్రత్యేకంగా ఐలాలు ఉన్నాయి. మిగిలిన ప్రాంతాల్లో యజమానులు సంఘాలుగా ఏర్పడ్డారు. ఒక యజమాని కంపెనీలో అగ్నిప్రమాదం లాంటి సంఘటనలు జరిగితే ఒకరికొకరు సహకారం చేస్తారు. కానీ, కార్మికుల అనారోగ్యం, మరణాల విషయంలో మాత్రం నిస్సహాయంగా వ్యవహరిస్తున్నాయి.

ఆరోగ్య భద్రత ఏదీ?

వలస కార్మికుల మరణాలు కేవలం నిర్లక్ష్యం వల్ల మాత్రమే జరగడం లేదు. దీని వెనుక అనేక లోతైన సామాజిక, ఆర్థిక సమస్యలు ఉన్నాయి. వలస కార్మికులకు సరైన ఆరోగ్య బీమా ఉండదు. ఒకవేళ ఉన్నా, దానిని ఉపయోగించుకోవడానికి అవసరమైన సమాచారం, సమయం, అక్షరాస్యత లేదు. యజమానులు కూడా కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ వారికి కనీస ఆరోగ్య భద్రత కల్పించడం లేదు. ఎక్కువ పని గంటల కారణంగా కార్మికులు శారీరకంగా, మానసికంగా అలసిపోయి, చిన్నపాటి ఆరోగ్య సమస్యలు కూడా పెద్దవిగా మారి ప్రాణాలు తీస్తున్నాయి. మరణించిన తర్వాత మృతదేహాన్ని స్వస్థలానికి పంపేందుకు అయ్యే ఖర్చులను భరించే స్థోమత ఉండకపోవడంతో, వారు నిస్సహాయులై తమవారి అంతిమ సంస్కారాలను వాట్సాప్ వీడియోల్లోనే చూసుకుంటున్నారు. ఈ దయనీయ పరిస్థితి వలస కార్మికుల పట్ల ఉన్న ఉదాసీనతను, వారి జీవన పోరాటంలో దాగి ఉన్న కఠిన వాస్తవాలను కళ్లకు కడుతుంది. ఈ సమస్యను పరిష్కరించాలంటే, కేవలం యజమానుల బాధ్యతను పెంచడమే కాకుండా, ప్రభుత్వాలు కూడా వలస కార్మికుల భద్రత, ఆరోగ్య సంరక్షణ కోసం కఠినమైన చట్టాలను అమలు చేయాలి.

కొన్ని ఘటనలు

● బీహార్ రాష్ట్రం రామ్‌గర్వ తాలూకా ఐనార గ్రామానికి చెందిన ఆమన్ కాటూన్ గడ్డపోతారం ప్రైవేటు పరిశ్రమలో పని చేస్తున్నారు. కుటుంబకలహాలతో అద్దెకు ఉంటున్న ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పనిచేస్తున్న కంపెనీ యజమాని సంబంధం లేదంటూ చేతులు ఎత్తివేసింది. శవాన్ని సొంత గ్రామానికి పంపాలంటే డబ్బు లేకపోవడంతో పోలీసులతో పాటు చుట్టుపక్కల వారు విరాళాలుగా వేసుకొని రూ.60వేలు ఇచ్చి వాహనం మాట్లాడి పంపారు.

● బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ యువకుడు పటాన్‌చెరు పారిశ్రామికవాడలో పని చేయడానికి వచ్చాడు. సొంత గ్రామానికి చెందిన స్నేహితుడి రూంలో దిగాడు. కంపెనీలో డ్యూటీ చేయడానికి వెళ్లగానే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చనిపోయిన వ్యక్తిని సొంత గ్రామానికి తీసుకువెళ్లలేక ఆర్థిక పరిస్థితి సహకరించకపోవడంతో ఎండీఆర్ ఫౌండేషన్ వారు దహన సంస్కారాలు చేశారు. చితి కాలుతుండగా కుటుంబసభ్యులకు వాట్సాప్‌లో చూపించారు.

● ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన బచ్చన్ సింగ్ రెండు నెలల క్రితం ఐడీఏబొల్లారం పారిశ్రామికవాడకు వచ్చారు. రెడీమిక్స్ యూనిట్‌లో కార్మికుడుగా పని చేస్తున్నాడు. అతడికి ఆరోగ్య సమస్యలు వచ్చాయి. తీసుకువచ్చిన కాంట్రాక్టర్ బచ్చన్‌సింగ్‌ను కారులో సొంత గ్రామానికి పంపించే ఏర్పాట్లు చేశారు. ఖాజీపల్లి అవుటర్ ఎక్కగానే చనిపోయాడు. భయపడిన కారు డ్రైవర్ శవాన్ని ఫుట్‌పాత్‌పై పడుకోబెట్టి వెళ్లిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని కాంట్రాక్టర్‌కు అప్పగించారు. అనంతరం మరో కారులో పోలీసులు ఇచ్చిన పత్రం ఆధారంగా సొంత గ్రామానికి పంపారు.

● ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన మనోజ్ పటాన్‌చెరు ప్రాంతంలోని ఓ ఫార్మా అనే పరిశ్రమలో పని చేస్తున్నాడు. విధి నిర్వహణలో ఉన్నప్పుడే స్పృహ తప్పికింద పడిపోయాడు. అనంతరం ప్రాథమిక వైద్యం అందించారు. అద్దెకుంటున్న ఇంట్లోనే చనిపోయాడు. అతడి మృతదేహాన్ని సొంత గ్రామానికి పంపించే క్రమంలో పరిశ్రమ యాజమాన్యంతో స్థానికులు గొడవ చేస్తే రూ.8 లక్షలు పరిహారం ఇచ్చారు. అనంతరం అంబులెన్స్‌లో సొంత గ్రామానికి మృతదేహాన్ని పంపించారు.



రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి

● పార్లమెంట్‌లో ప్రస్తావించిన ఎంపీ సురేష్ షెట్కార్



పార్లమెంట్‌లో మాట్లాడుతున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్, జూలై 31(ఆంధ్రజ్యోతి): రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలని కోరుతూ జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ బుధవారం పార్లమెంట్‌లో ప్రస్తావించారు. జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ దేశంలోని 17 రాష్ట్రాల్లో రజకులు ఎస్సీ జాబితాలో కొనసాగుతున్నారని, 11 రాష్ట్రాల్లో మాత్రం ఓబీసీగా పరిగణిస్తున్నారన్నారు. దీంతో రజక కులానికి న్యాయం జరగడం లేదన్నారు. అన్ని రాష్ట్రాల మాదిరిగా న్యాయం జరగాలని, అందుకోసం కేంద్ర ప్రభుత్వం తక్షణం చొరవ తీసుకొని ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు.

పల్లెవెలుగు బస్సులకే.. ఎక్స్‌ప్రెస్ బోర్డులు

● ప్రయాణికుల నుంచి ఎక్స్‌ప్రెస్ చార్జీల వసూలు ● ఆర్టీసీ వింత పోకడ

నారాయణఖేడ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పల్లె ప్రాంతాల ప్రయాణికుల సౌలభ్యానికి వినియోగించాల్సిన ఆర్టీసీ పల్లె వెలుగు బస్సులను ఎక్స్‌ప్రెస్ బోర్డులు ఏర్పాటు చేసి పట్టణ ప్రాంతాలకు నడుపుతున్నారు. పల్లెవెలుగులో ఎక్స్‌ప్రెస్ చార్జీలను వసూలు చేస్తూ ప్రయాణికుల జేబులకు చిల్లు పెడుతున్నారు.

ఖేడ్ డిపోలో యాభై శాతం ఎక్స్‌ప్రెస్‌లే..

నారాయణఖేడ్‌లో ఆర్టీసీ డిపో ఉన్నప్పటికీ, ప్రధానమైన గ్రామీణ రూట్లలో బస్సులను నడపకుండా హైదరాబాద్ రూట్‌కే ప్రాధాన్యం ఇస్తున్నారు. ఉన్న బస్సుల్లో 50 శాతానికిపైగా ఎక్స్‌ప్రెస్ బస్సులే ఉన్నాయి. అయినప్పటికీ పల్లె వెలుగు బస్సులకు కూడా ఎక్స్‌ప్రెస్ బోర్డులు పెట్టి సంగారెడ్డి, పటాన్‌చెరు, లింగంపల్లి, ప్రాంతాలకు నడుపుతున్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో నడపడానికి కేటాయించిన బస్సులను కూడా ఈవిధంగా నగరానికి నడుపుతుండడంతో, గత్యంతరం లేక ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తుంది. మరోవైపు ఎక్స్‌ప్రెస్ చార్జీలు వసూలు చేస్తూ, పల్లె వెలుగు బస్సులను ఎక్స్‌ప్రెస్‌లుగా నడుపుతూ తమను అసహనానికి గురిచేస్తున్నారని పలువురు ప్రయాణికులు పేర్కొన్నారు. నారాయణఖేడ్ డిపోలో ఎక్కడ లేని ఈ విధానం కొనసాగుతుండడం పట్ల ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డీఎం మల్లేశయ్యను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా డిపోలో అవసరానికి అనుగుణంగా ఎక్స్‌ప్రెస్ బస్సులు లేనందున ఈ విధంగా నడుపుతున్నట్లు సమాధానమిచ్చారు.



సిగాచి పరిహారంపై రాజకీయం చేయొద్దు

● ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

పటాన్‌చెరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పాలనలో మృతిచెందిన కార్మికులకు పరిహారం ఇప్పించలేని మాజీ మంత్రి హరీశ్‌రావు.. ఇప్పుడు సిగాచి బాధిత కుటుంబాలకు పరిహారం ఇవ్వాలంటూ కోరడం హాస్యాస్పదంగా ఉందని భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి అన్నారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రమాద విషయం తెలిసిన మరుక్షణం సీఎం రేవంత్‌రెడ్డి పరిశ్రమకు వచ్చి పరిస్థితిని చూసి మృతులకు రూ.కోటి పరిహారం చెల్లించేటట్టు ఏర్పాటు చేస్తామని చెప్పారని తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను కలెక్టర్, ఎస్పీ స్థాయి అధికారులు చేస్తున్నారని వివరించారు. ఇప్పటికే కొంత మొత్తం చెల్లింపులు సైతం జరిపారని అన్నారు. మంత్రులు దామోదర్ రాజనర్సింహ, గడ్డం వివేక్, ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పర్యవేక్షణ జరుపుతున్నారని వివరించారు. జిల్లాలో ప్రమాదాల బారినపడి 110 మంది కార్మికులు చనిపోయారని తెలిపారు. రూ.20 లక్షలు కూడా ఇప్పించని హరీశ్‌రావు మాట్లాడటం సిగ్గుచేటని తెలిపారు.

ఆ ఎనిమిది మంది ఏమయ్యారు ?

● సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్



మాట్లాడుతున్న జయరాజ్

పటాన్‌చెరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సిగాచి పరిశ్రమలో పనిచేస్తూ కనిపించకుండా పోయిన ఎనిమిది మందిని గుర్తించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి జయరాజ్ అన్నారు. గురువారం పటాన్‌చెరు శ్రామిక్‌భవన్‌లో రాజకీయ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. సిగాచిలో ప్రమాదం జరిగి 30 రోజులు గడుస్తున్నా చనిపోయిన 54 మందికి రూ.కోటి చొప్పున పరిహారం చెల్లించకపోవడం అన్యాయమని తెలిపారు. ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉంటున్న వారి కుటుంబీకులు ఎక్కడికి వెళ్లాలో తెలియక ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని వివరించారు. చనిపోయిన మృతుల కుటుంబాలకు డెత్ సర్టిఫికెట్లు త్వరితగతిన అందజేసేటట్లు ఇస్నాపూర్ మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్యదర్శి నాగేశ్వరరావు, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బోడకాకర.. బహుప్రియం

నారాయణఖేడ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో మాత్రమే లభించే అడవి కాకర కాయలు(బోడకాకర) మార్కెట్‌లలో ఇప్పుడిప్పుడే వస్తున్నాయి. ఈ సీజన్‌లో లభించే బోడకాకరను కొనేందుందుకు జనం ఆసక్తి చూపుతున్నారు. గతంలో బోడకాకరకాయలు గ్రామాల్లో ఉచితంగా లభించేవి. క్రమేణా ఈ జాతి కాకర కనుమరుగుతవుతుండడంతో విరివిగా లభించడం లేదు. దీంతో ప్రస్తుతం విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. నారాయణఖేడ్ మార్కెట్లో విక్రయానికి వచ్చిన బోడకాకర కిలో రూ.200 వరకు పలికింది. అంత ధర ఉన్న జనాలు కొనుగోలు చేశారు.





విద్యాధరిలో బండ ప్రకాశ్ ప్రత్యేక పూజలు

శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ గురువారం కటుంబసమేతంగా సిద్దిపేట జిల్లా వర్గల్ మండలంలోని విదాదరి క్షేత్రాన్ని సందర్శించారు. విద్యాసరస్వతీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మండపంలో ఆయన మనవడు భవ్యాంక్‌కు వేద పండితులు వేద మంత్రోచ్ఛరణల మధ్యన అక్షర స్వీకారం చేయించారు.

-వర్గల్, జూల్ 31 (ఆంధ్రజ్యోతి)

కార్యకర్తలకు అండగా ఉంటా..

- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనరసింహ

పుల్‌కల్, జూలై 31 ఆంధ్రజ్యోతి) : కార్యకర్తల, నాయకులకు ఎప్పుడూ అండగా ఉంటానని మంత్రి దామోదర్ రాజనరసింహ అన్నారు. చౌటకూర్ మండలం హన్నాపూర్ గ్రామానికి చెందిన దివంగత సీనియర్ దళిత ఉద్యమ నాయకుడు నాగిరెడ్డిపల్లి కృష్ణంరాజు కుటుంబాన్ని అన్నివిధాలుగా ఆదుకుంటామని ఆయన హామీఇచ్చారు. అస్వస్థతకు గురైన కృష్ణంరాజు చికిత్స పొందుతూ జూలై 13న మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు మంత్రి , యువజన కాంగ్రెస్ నాయకురాలు త్రిషతో కలిసి గురువారం గ్రామానికి వెళ్లి మృతుడు కృష్ణంరాజు కుటుంబసభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ఆయన చిన్న కుమారుడు నాగిరెడ్డిపల్లి స్టాలిన్‌రాజ్ వైద్య విద్యనభ్యసిస్తుండటంతో అందుకయ్యే ఖర్చు మొత్తాన్ని తాను భరిస్తానని, కుటుంబానికి అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు. మంత్రి వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నత్తి దశరత్, జోగిపేట డివిజన్ ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



కృష్ణంరాజు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న రాజనరసింహ

అంబేడ్కర్ చెప్పిన విధంగానే రాష్ట్రం సిద్ధించింది

- నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : చిన్న రాష్ట్రాలతోనే అభివృద్ధి సాధ్యమని అంబేడ్కర్ చెప్పిన విధంగానే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఉసిరికపల్లిలో గురువారం అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కృష్ణారావు సమక్షంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ మహేష్‌గుప్తా, సీనియర్ నాయకులు కృష్ణారావు, అంబేడ్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిషన్, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యులు మన్సూర్, పార్టీ అధ్యక్షుడు రమణాగౌడ్, అంబేడ్కర్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సిరికపల్లిలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే సునీతారెడ్డి

సంస్కృతీ సంప్రదాయాలకు తీజ్ ప్రతీక

శివ్వంపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సంస్కృతీ సంప్రదాయాలకు తీజ్ ప్రతీక అని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని సీతారాంతండాలో గురువారం నిర్వహించిన తీజ్ ఉత్సవాలకు ఆమె ముఖ్యఅతిధిగా హాజరై పూజలు నిర్వహించారు. అలాగే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి కూడా తీజ్‌లో పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ మహేష్‌గుప్తా, నాయకులు మన్సూర్, రమణాగౌడ్, గిరిజనులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయస్వామిని దర్శించుకున్న మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు డివిజన్ పరిధి కృషి డిఫెన్స్ కాలనీలో అభయాంజనేయస్వామి వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు జరిపారు. కాలనీవాసులు ప్రత్యేకంగా జరిగిన పూజల్లో పాల్గొన్నారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, గూడెం మధుసూదన్‌రెడ్డి, కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడు అమరేందర్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు వైద్యమందించాలి

- మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరామ్



కొల్చారం ఆసుపత్రిలో మందులను పరిశీలిస్తున్న శ్రీరామ్

కొల్చారం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండి వైద్యమందించాలని మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ అన్నారు. గురువారం కొల్చారం మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటున్నారా.. లేరా అని ఆరాతీశారు. గ్రామాల్లో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేసి సీజనల్ జ్వరాలు వస్తే వారికి ప్రత్యేక వైద్యం చేయాలని పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ తప్పదు : రాహుల్‌రాజ్

చేగుంట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఉద్యోగికి ఏదో ఒకరోజు ఉద్యోగ విరమణ తప్పదని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. నార్సింగిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన తహసీల్దార్ షేక్ కరీం ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. సర్వీసులో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన సేవలే గుర్తింపునిస్తాయని చెప్పారు. అనంతరం షేక్ కరీంను కలెక్టర్, తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల తహసీల్దార్లు, రెవెన్యూ అధికారులు, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఏఎస్పీ సేవలు మరువలేనివి : ఎస్పీ పంకజ్

సంగారెడ్డి క్రైం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. అదనపు ఎస్పీ ఏ.సంజీవరావు, ఎస్ఐలు యాదవరెడ్డి, అలీమొద్దీన్, ఏఎస్ఐ అజీమొద్దీన్ గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ఏఎస్పీ సంజీవరావు సౌమ్యశీలి అని, నిర్వహణ విభాగంలో క్రియాశీలకంగా విధులు నిర్వర్తించారని తెలిపారు. రిటైర్మెంట్ అనంతరం పోలీస్‌శాఖ నుంచి వారికి రావాల్సిన అన్నిరకాల రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను సకాలంలో అందేవిధంగా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావ్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి ఇ.కళ్యాణి, ఎఆర్ డీఎస్పీ నరేందర్, ఆఫీస్ సూపరింటెండెంట్ అశోక్, మోహనప్ప, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్ఐలు రామారావ్, రాజశేఖర్, డానియెల్ తదితరులు పాల్గొన్నారు.



అదనపు ఎస్పీ సంజీవరావును సత్కరిస్తున్న ఎస్పీ పంకజ్

అడవుల రక్షణతోనే ఆక్సిజన్



చెట్ల పెంపకంపై పిల్లలకు అవగాహన చేస్తున్న అంబర్‌సింగ్

రామాయంపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : అడవుల రక్షణతోనే ఆక్సిజన్ అందుతుందని రామాయంపేట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అంబర్‌సింగ్ అన్నారు. చెట్ల ప్రయోజనాలపై గురువారం స్కూల్ పిల్లలకు వనదర్శిని కార్యక్రమం ఏర్పాటు చేశారు. రామాయంపేట మండల పరిధి అక్కన్నపేట రిజర్వ్ ఫారెస్ట్‌లో వివేకానంద పాఠశాల విద్యార్థులకు అడవులపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులతో మొక్కలను నాటించారు. దీనిలో ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు గీత, శ్రీనివాస్, బీట్ ఆఫీసర్ లక్ష్మణ్, స్కూల్ ప్రిన్సిపాల్ రామ్‌కుమార్ ఉన్నారు.

'నిరుపేదల సంక్షేమం కోరేది కాంగ్రెస్ ప్రభుత్వమే'

కోహీర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నిరుపేదల సంక్షేమం కోరేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆత్మ కమిటీ చైర్మన్ పట్లోల్ల రామలింగారెడ్డి అన్నారు. శుక్రవారం కోహీర్ మండలంలోని పైడిగుమ్మల్ గ్రామంలో నిర్వహించిన రేషన్‌కార్డుల పంపిణీలో పాల్గొని మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వేల సంఖ్యలో కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసిందన్నారు. అనంతరం ఆత్మ కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన లింగారెడ్డిని గ్రామ నాయకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ రాందాస్, మాజీ ఎంపీటీసీ రత్నయ్య, నాయకులు జయసింహారెడ్డి, నవీన్, నరసింహులు, సాంసన్, అశోక్, రాథోడ్ వినోద్, అజయ్ పాల్గొన్నారు.

పశువైద్య కేంద్రం ఎదుట రైతుల ఆందోళన

శివ్వంపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండల పశువైద్యాధికారి, సిబ్బంది నిర్లక్ష్యంతో సకాలంలో పశువులకు వైద్యం అందక మృత్యువాతపడుతున్నాయని, సిబ్బందికి వైఖరికి నిరసనగా మండల కేంద్రమైన శివ్వంపేటలోని పశువైద్య కేంద్రం ఎదుట 20 మంది రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు దద్వాయి అశోక్, రమేష్, బిక్షపతి మాట్లాడుతూ మూగజీవాలకు వైద్యం అందించడంలో పశువైద్య సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు స్పందించి పశువులకు సకాలంలో వైద్యమందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు కోసం కలిసి పోరాడుదాం

మెదక్ అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బీసీ బిల్లు సాధనకై అందరం కలిసి పోరాడుదామని యునైటెడ్ ఫూలే ఫ్రంట్ రాష్ట్ర నేత పడిగే ప్రశాంత్ పిలుపునిచ్చారు. బీసీ బిల్లు సాధన కోసం తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత చేపట్టిన 72 గంటల నిరాహార దీక్ష పోస్టర్ గురువారం ఐబీ గెస్ట్‌హౌజ్‌లో జిల్లా నాయకుడు రమేష్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ బలహీన వర్గాలకు వెన్నుపోటు పొడిచిందన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీ బిడ్డలు కాంగ్రెస్ సర్కార్‌కు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

సెప్టెంబరు నుంచి ప్రత్యేక తరగతులు



ఎంఈవో యాదగిరిని సన్మానిస్తున్న డీఈవో, ఉపాధ్యాయులు

వెల్దుర్తి, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సెప్టెంబరు నుంచి పది విద్యార్థులకు ప్రత్యేక తరగతులు ప్రారంభం కానున్నాయని మెదక్ జిల్లా విద్యాధికారి రాధాకిషన్ అన్నారు. వెల్దుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం జరుగుతున్న ప్రార్థనలో పాల్గొని మాట్లాడారు. పది విద్యార్థులకు సెప్టెంబరు 1 నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహించడంతో పాటు అల్పాహారం ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రతీ విద్యార్థి ప్రతిరోజు పాఠశాలకు హాజరై హాజరుశాతం పెంచాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, నేటి నుంచి ఉపాధ్యాయులకు ముఖగుర్తింపు కార్యక్రమం ప్రారంభమవుతుందని సూచించారు. అలాగే పాఠశాలలో ఉద్యోగ విరమణ పొందిన ఎంఈవో యాదగిరిని డీఈవో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సాంబయ్య, అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శనమూర్తి పాల్గొన్నారు.

'విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి'

కొండాపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులు అర్థమయ్యేలా బోధించాలని సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు సూచించారు. గురువారం కుతుబ్‌షాయిపేట్, బ్రహ్మంగారి, పెద్దమ్మగడ్డతండాల్లో మూతబడిన పాఠశాలలను సందర్శించి, ఇక్కడి విద్యార్థుల చదువులపై అంగన్‌వాడీ టీచర్లను అడిగి తెలుసుకున్నారు. తమ్మళిబాయితండా పాఠశాలను కూడా తనిఖీ చేసి ఉపాధ్యాయుల బోధన, వర్క్‌బుక్స్, నోట్‌బుక్స్, టీచింగ్ డైరీ నమోదు, తల్లిదండ్రుల సమావేశాలు, తదితర రిజిస్టర్లను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈవో వెంట ఎంఈవో దశరథ్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

పదవులపై ధ్యాస తప్పా.. ప్రజల సమస్యలు పట్టవా..?

- మహిళా ఎమ్మెల్యేగా గౌరవిస్తున్నాం.. అలుసుగా తీసుకోవద్దు
- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్ తదితరులు

నర్సాపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ ఎమ్మెల్యేకు పదవులపై ధ్యాస తప్ప ప్రజల సమస్యలు పట్టవని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ విమర్శించారు. గురువారం నర్సాపూర్‌లోని ఆవుల రాజిరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎప్పుడూ ప్రొటోకాల్ విషయంలో రాద్ధాంతం చేయడం తప్పా.. ఏనాడు నియోజకవర్గంలోని ప్రజల సమస్యలు పట్టించుకోవడం లేదన్నారు. తాము అధికారంలో ఉన్న పార్టీ నాయకులుగా అధికారిక కార్యక్రమాల్లో ఎమ్మెల్యేకు గౌరవం ఇస్తూనే.. ప్రొటోకాల్ ఇబ్బందులు రాకుండా ప్రజల మధ్య ఉంటే కూడా జీర్ణించుకోకపోవడం విడ్డూరమన్నారు. తాము ఓ మహిళా ఎమ్మెల్యేగా గౌరవిస్తుంటే అలుసుగా తీసుకోవద్దని, కచ్చితంగా అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటామని, రాద్ధాంతం చేయాలని చూస్తే తాము కూడా అదేవిధంగా వ్యవహరించాల్సి వస్తోందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో ప్రభుత్వ పథకాలన్నీ ఆ పార్టీ కార్యకర్తలకే ఇచ్చుకున్నారని, కానీ రేవంత్‌రెడ్డి హయాంలో పార్టీలకతీతంగా అర్హులైన అందరికీ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, పార్టీ మండల అధ్యక్షుడు మల్లేశం, పట్టణ అధ్యక్షుడు డీ.ఆంజిగౌడ్, మాజీ ఎంపీపీ లలిత, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉదయ్, బ్లాక్ అధ్యక్షుడు రిజ్వాన్, శ్రీనివాస్‌రెడ్డితోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయాలి

పీసీసీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలో ఆగస్టు 1న అందోల్ నియోజకవర్గంలోని సంగుపేటలో చేపట్టే పాదయాత్రను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ కార్యకర్తలు, నాయకులకు సూచించారు.

న్యూస్ బాక్స్

సబ్ కలెక్టర్‌కు సన్మానం

నారాయణఖేడ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : ఖేడ్ డివిజన్ సబ్ కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఉమాహారతిని సబ్ కలెక్టర్ కార్యాలయంలో గురువారం విశ్రాంత ఉద్యోగుల సంఘం బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను శాలువాలతో సన్మానించి పుష్పగుచ్ఛాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తహసీల్దార్ హసీనాబేగంను సైతం సన్మానించారు. ఇందులో ఖేడ్ విశ్రాంత ఉద్యోగుల సంఘం బాధ్యులు నర్సింలు, వీరయ్య, కిష్టయ్యమాస్టర్, వెంకటేశం, జయరాజ్,మనోహర్, తదితరులు ఉన్నారు.

పలు వార్డుల్లో ఆవుల రాజిరెడ్డి పర్యటన

నర్సాపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : 'నమస్తే నర్సాపూర్' పేరిట నిర్వహిస్తున్న పర్యటనలో భాగంగా కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి గురువారం 4, 5వ వార్డుల్లో పర్యటించారు. స్థానిక ప్రజలను కలిసి సమస్యలు తెలుసుకుని, పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు.

'పరిశుభ్రత లక్ష్యం కావాలి'

నారాయణఖేడ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పరిశుభ్రత ప్రతీ ఒక్కరి లక్ష్యం కావాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని మార్కండేయ కాలనీలో గురువారం కాలనీలోని పలు చోట్ల తడి, పొడి చెత్తలపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు.

అక్రమ వెంచర్లను అరికట్టాలి

నారాయణఖేడ్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నారాయణఖేడ్ డివిజన్ పరిధిలోని కంగ్టి, నాగల్‌గిద్ద, ఖేడ్ ప్రాంతాల్లో అక్రమంగా ఏర్పాటు చేస్తున్న వెంచర్లను నిర్మూలించాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి రమేష్ అన్నారు. గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయం డీఏవో అనితకు వినతిపత్రం అందించారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ఝరాసంగం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ఝరాసంగంలోని మోడల్ స్కూల్‌లో కాంట్రాక్ట్ ప్రాతిపదికన ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీనావతీ ఓ ప్రకటనలో గురువారం పేర్కొన్నారు. పీజీటీ ఫిజిక్స్ టీజీటీ ఇంగ్లిష్ సబ్జెక్టులు ఖాళీగా ఉన్నట్లు ఆమె తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆగస్టు 4న పాఠశాలలో నిర్వహించే డెమో క్లాస్‌కు హాజరుకావాలన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు వెంట తెచ్చుకోవాలని చెప్పారు.

'పరిశుభ్రత పాటించాలి'

పెద్దశంకరంపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించాలని నిహారిక ఫౌండేషన్ ప్రతినిధి నిరూపమారావు సూచించారు. గురువారం పెద్దశంకరంపేటలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలోని విద్యార్థులకు శానిటరీ ప్యాడ్స్ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెదక్ జిల్లాలోని పాపన్నపేట, కొల్చారం, టేక్మాల్, పెద్దశంకరంపేట కేజీబీవీలోని విద్యార్థినులకు అందజేసినట్లు తెలిపారు.

ఉత్తమ ఉద్యోగులకు సన్మానం

నర్సాపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లతో పాటు ఇతర ఉద్యోగుల్లో ఉత్తమ సేవలందించిన వారిని గురువారం సన్మానించారు. డిప్యూటీ ఆర్ఎం ఎస్‌వీకే మూర్తి, డిపో మేనేజర్ సురేఖ, అసిస్టెంట్ మేనేజర్ వీరబాబు, డిపో ఇన్‌చార్జి లక్ష్మణ్ తదితరులు పాల్గొని ఉత్తమ సేవలందించిన వారిని సన్మానించి, సర్టిఫికెట్లు అందజేశారు. అదేవిధంగా ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు వీడ్కోలు పలికారు.

ఎంపీడీవోగా సతీష్ బాధ్యతల స్వీకరణ

తూప్రాన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తూప్రాన్ ఎంపీడీవోగా సతీష్ గురువారం పూర్తిస్థాయి బాధ్యతలు స్వీకరించారు. తూప్రాన్ ఎంపీడీవో శేషాద్రి గతనెల 30న ఉద్యోగ విరమణ పొందగా, తూప్రాన్ ఎంపీవో సతీష్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. గురువారం పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగిస్తూ జడ్పీ సీఈవో ఎల్లయ్య ఆదేశాలు జారీచేశారు. గురువారం బాధ్యతలు స్వీకరించగా, సిబ్బంది సన్మానించారు.

బైక్, టాటా ఏసీ ఢీ, ముగ్గురికి తీవ్రగాయాలు

చిన్నశంకరంపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : బైక్ టాటా ఏసీ వాహనం ఢీకొని ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన చిన్నశంకరంపేట మండలం ఖాజాపూర్‌తండా శివారు రామాయంపేట రహదారిపై గురువారం చోటు చేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం.. ఖాజాపూర్ తండాకు చెందిన బానోత్ రమేష్, జీవన్, సుధాకర్ ఒకే బైక్‌పై ప్రయాణిస్తున్నారు. గవ్వలపల్లి నుంచి రామాయంపేటకు వెళ్తున్న సుల్తాన్‌పూర్‌కు చెందిన వ్యక్తి టాటాఏసీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు 108 అంబులెన్స్‌లో జీవన్, సుధాకర్‌ను హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి, రమేష్‌ను మెదక్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సమాచారమందుకున్న పోలీసులు టాటాఏసీ డ్రైవర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గురుపీఠంలో సుహాసినిరెడ్డి పూజలు

శివ్వంపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేట మండలం గూడూరు గురుపీఠంలోని దత్తాత్రేయస్వామి సాయిబాబాను జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి గురువారం దర్శించుకున్నారు. పూజలు నిర్వహించి, బాబా హారతిలో పాల్గొన్నారు. అదేవిధంగా మండల అంగన్‌వాడీ టీచర్లు సాయిబాబా దత్తాత్రేయ స్వాములను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ మెంబర్లు బిక్షపతియాదవ్, శ్రీనివాస్‌గౌడ్, భక్తులు పాల్గొన్నారు.

పొలం బాట పట్టిన విద్యార్థులు



చందాపూర్‌లో నాట్లు వేస్తున్న విద్యార్థులు

చిన్నశంకరంపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : వీరంతా పాఠశాల విద్యార్థులు.. వరి సాగు గురించి పుస్తకాల్లో చదవడమే తప్పా ఎలా పండిస్తారో చాలామందికి తెలియదు. ఆ విషయాలను తెలుసుకునేందుకు గురువారం బడి నుంచి పొలం బడికి హాజరయ్యారు. చిన్నశంకరంపేట మండలంలోని పాఠశాల నుంచి 50 మంది విద్యార్థులు పంట సాగు విధానంపై రైతులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఉత్సాహంగా నాట్లు వేసి, సాగు, ఆహార భద్రత అవశ్యకత గురించి తెలసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పరమేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి



జహీరాబాద్‌లో ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

జహీరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సురేష్, తదితరులు డిమాండ్ చేశారు. ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని కోరుతూ గురువారం జహీరాబాద్ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో రహదారిపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. విద్యార్థుల బకాయిలను విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందీప్, అనిల్, శ్రీకాంత్, దినేష్, ఇస్మాల్, గోపాల్, రాకేష్, సుస్మిత, స్వాతి, రాణి, మల్లేశ్వరీ, స్వప్న పాల్గొన్నారు.

డయల్ యువర్ ఆర్టీసీ డీఎంకు స్పందన

సంగారెడ్డి అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : డచల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు. గురువారం నిర్వహించిన కార్యక్రమంలో 16 మంది ప్రయాణికులు తమ సలహాలు, సూచనలతో పాటు పలు సమస్యలను డీఎం దృష్టికి తీసుకొచ్చారు. సంగారెడ్డి నుంచి గజ్వేల్‌కు ఉదయం 8.20 బస్సు నడపాలని కోరారు. సంగారెడ్డి చౌరస్తా బస్టాప్ వద్ద ఆటోలు అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయడం వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆటోలు ఆపకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మీనాక్షీ నటరాజన్ పాదయాత్రను అడ్డుకుంటాం

- బీజేపీ మండల అధ్యక్షుడు నీరుడి ప్రవీణ్‌కుమార్

పుల్‌కల్, జూలై 31 ఆంధ్రజ్యోతి): అందోలు నియోజకవర్గంలో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ చేపట్టనున్న పాదయాత్రను అడ్డుకుంటామని బీజేపీ చౌటకూర్ మండల అధ్యక్షుడు నీరుడి ప్రవీణ్‌కుమార్‌ముదిరాజ్ తెలిపారు. మండల కేంద్రమైన చౌటకూర్ నుంచి పోసానిపల్లి మీదుగా బొమ్మారెడ్డిగూడెం వెళ్లే రహదారి అధ్వానంగా మారడంతో బీజేపీ శ్రేణులు గురువారం రోడ్డుపై నిలిచిన నీటిలోకి దిగి నిరసన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అధికారం చేపట్టి 19 నెలలు కావస్తున్నా రోడ్ల పరిస్థితి మారలేదని ప్రవీణ్ విచారం వ్యక్తం చేశారు. ఈ నెల 1, 2వ తేదీల్లో జరుపతలపెట్టిన పాదయాత్రను అడ్డుకుని, రోడ్ల దుస్థితిపై నిరసన తెలుపుతామన్నారు. ఈ నిరసనలో బీజేవైఎం మండల ఉపాధ్యక్షుడు శివకుమార్, నాయకులు గోపి, రామకృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు

చిన్నశంకరంపేట, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడులు పొందొచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త, సెఫల్ ఫౌండేషన్ సభ్యుడు మనదీప్ అన్నారు. సెఫల్ ఫౌండేషన్, హెచ్‌డీఎఫ్‌సీ పరివర్తన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో గురువారం చిన్నశంకరంపేట మండల పరిధిలోని మడూర్ గ్రామంలో రైతులకు సేంద్రియ పంటల సాగు విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రతిభ, ఏఈవో శేఖర్, ప్రాజెక్టు కోఆర్డినేటర్ గౌతమ్, ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ విక్రాంత్ తదితరులు పాల్గొన్నారు.

రహదారిపై తాత్కాలిక మరమ్మతులు

రామచంద్రాపురం, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రహదారిలో ప్రవహిస్తున్న మురుగునీటిని ఓ పక్కకు తీసివేయడానికి మున్సిపాలిటీతో పాటు, ట్రాఫిక్ సిబ్బంది గురువారం తెల్లాపూర్ ముఖద్వారం పనులు చేపట్టారు. ఎప్పుడూ తాత్కాలిక పనులు చేయడం వల్ల ఎటువంటి ప్రయోజనం లేదని స్థానికులు మండిపడ్డారు. ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, మున్సిపాలిటీ అధికారులు మురుగునీటి చుట్టూ ప్రదర్శనలు చేయడం కేవలం ప్రజల దృష్టిని మళ్లించమేనని విమర్శించడమేనన్నారు. ఇప్పటికైనా అధికారులు రహదారి పైకి మురుగునీరు రాకుండా శాశ్వత చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

జెండర్ సఖీ ద్వారా సమస్యలు పరిష్కరించుకోవాలి

నర్సాపూర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని చిన్న సంఘాల్లో వచ్చే సమస్యలను జెండర్ సఖీ ద్వారా పరిష్కరించుకోవాలని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. గురువారం నర్సాపూర్ మండలం చిన్న చింతకుంట గ్రామంలో నిర్వహించిన మహిళా సమైఖ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సమస్యలను కౌన్సిలింగ్ ద్వారా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రాజెక్టు మేనేజర్ సరిత, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్, జిల్లా జెండర్ సభ్యులు చింతల లక్ష్మి, ఏపీఎం గౌరీశంకర్ పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయండి : యూఎస్‌పీసీ

నారాయణఖేడ్/గుమ్మడిదల, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 5న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని యూఎస్‌పీసీ రాష్ట్ర నాయకుడు, టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి కోరారు. గురువారం నారాయణఖేడ్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు జరుగుతున్న సందర్భంలో ఆమె ఉపాధ్యాయుల వద్దకు వెళ్లి ధర్నాలో ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్ స్థానిక, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు. గుమ్మడిదల మండలంలోని బొంతపల్లి ఉన్నత పాఠశాలలో యూఎస్‌పీసీ రాష్ట్ర నాయకుడు కే.జానారెడ్డి ఆధ్వర్యంలో ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు.

సుతారి సంఘం కార్యవర్గం ఎన్నిక

మెదక్ అర్బన్, జూలై 31 (ఆంధ్రజ్యోతి) : హనుమన్ సుతారి సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం పట్టణంలోని సంఘం జిల్లా అధ్యక్షుడు కిషన్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నాయికోటి శేఖర్, ప్రధాన కార్యదర్శిగా సుంకరి లింగం, ఉపాధ్యక్షులు యాదగిరి, కోశాధికారి బి. యాదగిరితోపాటు పలువురు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రాందేవ్, మల్లేశం, నర్సింలు, అంజయ్య, యాదగిరి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.